సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 1 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 564 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



పోలీసు వలయంలో జిల్లా

కౌంటింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లాను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
47.1°/23.7°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పండ్ల అలంకరణలో నెట్టికంటుడు



అలంకరణలో ఆంజనేయస్వామి

గుంతకల్లు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి మహోత్సవాల్లో 4వ రోజు శుక్రవారం పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవలో మూలవిరాట్‌కు శత (108) కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆపిల్, అరటి, మామిడి, బత్తాయి, ద్రాక్ష, కళింగర పండ్లతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తలకు దర్శనభాగ్యం కలి్పంచారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి మల్లెపూలతో లక్షార్చన నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మూడు రోజులు మద్యం దుకాణాల బంద్

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లాలో మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలపై నిషేధం విధించారు. ఓట్లు లెక్కింపు ముందు రోజు అంటే 3వ తేదీ నుంచి ఫలితాల వెల్లడి తర్వాతి రోజు (5వ తేదీ) వరకు మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, ఎక్సైజ్ డిపార్టుమెంట్ నుంచి లైసెన్స్ పొందిన దుకాణాలు బంద్ చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సహదేవ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: జిల్లాలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు https://jnbnivas.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 20వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే డబ్బు జమ
- దీర్ఘకాలిక జబ్బులున్న వారికి మాత్రం ఇంటి వద్దే అందజేత



పింఛన్ తీసుకుంటున్న వృద్ధురాలు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ మాసానికి సంబంధించి జిల్లాలో 2,71,383 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.80.98 కోట్లు మంజూరు చేసింది. శనివారం ఉదయం నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్ పంపిణీ ప్రక్రియ చేపట్టనున్నారు. పింఛన్ కోసం ఎవరూ సచివాలయాలకు వెళ్లాల్సిన పని లేకుండా పింఛన్‌దారుల ఆధార్ అనుసంధానమైన ఖాతాల్లోకి డబ్బు జమ చేయనున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు, మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానమైన 1,93,948 మందికి రూ.58.18 కోట్ల నగదు ఖాతాల్లో జమ చేయనున్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు జిల్లాలో 77,435 మంది ఉండగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి రూ.22.80 కోట్లు పంపిణీ చేయనున్నారు. పింఛన్ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి జమచేస్తారు? ఎవరికి ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తారన్న వివరాలు ఆయా సచివాలయాల వద్ద నోటీసు బోర్డులో ప్రదర్శించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంటి వద్ద పింఛన్ తీసుకునేందుకు వేలిముద్ర పడక పోయినా ముఖ కదలికలు (ఆర్‌బీఐఎస్)ద్వారా అందించేలా అనుమతించారు.

టెన్షన్..అంతా అటెన్షన్

ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు... ఎంత మెజార్టీ వస్తుంది...ఏ నియోజకవర్గంపై ఎంత బెట్టింగ్ నడుస్తోంది.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ నలుగురు కలిసినా ఇదే చర్చ. కౌంటింగ్‌కు మూడు రోజులే గడువు ఉండటంతో అందరూ ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. జిల్లా యంత్రాంగం కూడా కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేపడుతోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది.

- కౌంటింగ్ కౌంట్ డౌన్ స్టార్ట్
- వేడెక్కిన ఎన్నికల వాతావరణం
- మరో మూడు రోజుల్లో కౌంటింగ్
- కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరం
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ



కౌంటింగ్ కేంద్రంలో సిద్ధం చేసిన టేబుళ్లు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల ప్రక్రియలో చివరి అంకమైన కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. జూన్ 4వ తేదీన అభ్యర్థుల భవితవ్యం తేలనుండగా, అంతటా ఫలితాలపైనే చర్చ నడుస్తోంది. తమ పార్టీనే గెలుస్తుందంటే తమ పార్టీనే విజయఢంకా మోగిస్తుందంటూ కార్యకర్తలు ఎవరికి వారు ధీమాతో ఉన్నారు. కానీ ఈసారి ఓటరు నాడి కచ్చితంగా ఎవరూ పట్టలేకపోతున్నారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల బెట్టింగ్ రూ.కోట్లలో నడుస్తోంది.

ఏర్పాట్లు ముమ్మరం

ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడేకొద్దీ అధికారులు ఏర్పాట్లలో బిజీగా మారారు. లేపాక్షి గురుకుల పాఠశాల, హిందూపురం బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు రోజూ కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బారికేడ్లు, టేబుళ్ల ఏర్పాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. కేంద్రాల వద్ద నిఘా కోసం సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. ఇతరులు కేంద్రాల సమీపంలో సంచరించకుండా 144 సెక్షన్ విధించారు.

విధుల్లో 896 మంది సిబ్బంది

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. కచ్చితమైన ఫలితాలు వెల్లడించడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఆయా నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 196 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్లు లెక్కింపునకు మరో 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ నిర్వహణకు 896 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి టేబుల్‌కూ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రోఅబ్జర్వర్‌ను నియమించారు.

అందరిలోనూ ఉత్కంఠ

కౌంటింగ్ దగ్గర పడే కొద్దీ అభ్యర్థులతో పాటు ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ టెన్షన్ పెరిగిపోయింది. పోలింగ్ బూత్‌ల వారీగా తమ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో లెక్కలు వేసుకుంటూ ఫలితంపై అంచనాలు వేసుకుంటున్నారు. సర్వేలతో కొందరు తాము సేఫ్ అంటూ ఊపిరి పీల్చుకుంటుండగా, మరికొందరు మాత్రం ఫలితం కోసం తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇప్పటికే ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ వేసిన వారు కూడా తీవ్ర టెన్షన్‌కు గురవుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం

జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఇందుకోసం అధికారులు 28 టేబుళ్ల ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కిస్తారు. ఈ ప్రక్రియ అంతా అరగంటలో పూర్తవుతుంది. ఆ తర్వాత 8.30 గంటలకు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రౌండ్ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను సువిధ యాప్‌లో నమోదు చేసిన అనంతరం బయటకు వెల్లడిస్తారు. ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లను కౌంటింగ్ గదులకు తీసుకొస్తారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు మొదట ఈవీఎంల సీల్ చెక్ చేస్తారు. సక్రమంగా ఉంటే కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో రిజల్ట్ బటన్ నొక్కి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలియజేస్తారు. ఈవీఎంలు ఓపెన్ కాకున్నా, బ్యాటరీలు పని చేయకున్నా... ఆర్‌ఓలకు చెప్పి బ్యాటరీలను మారుస్తారు. ఓపెన్ చేసి రిజల్ట్ చూస్తారు. ఒక్కో ఈవీఎం ద్వారా ఓట్ల లెక్కింపునకు 30 నిమిషాలు పడుతుంది. అభ్యర్థుల వారీగా పోలైన ఓట్ల వివరాలను 17సీ పార్ట్–2లో నమోదు చేస్తారు. వాటిని ఆర్‌ఓలకు పంపి కౌంటింగ్ ఏజెంట్లతో సంతకాలు చేయించి వివరాలు వెల్లడిస్తారు. అనంతరం ఈవీఎంలను సీల్ వేసి స్ట్రాంగ్ రూంకు పంపుతారు.

జిల్లాలో పోలైన ఓట్లు, ఏర్పాటు చేసిన టేబుళ్లు, రౌండ్ల వివరాలు ఇలా....

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాప్తాడు	281	2,13,207	14	21
మడకశిర	241	1,84,358	14	18
హిందూపురం	253	1,93,906	14	19
పెనుకొండ	265	2,05,192	14	19
పుట్టపర్తి	241	1,82,090	14	18
ధర్మవరం	290	2,18,292	14	21
కదిరి	281	2,06,214	14	21
మొత్తం	1,852	14,03,259	98	137

రైతులకు అందుబాటులో మేలైన విత్తనాలు

- రేకులకుంట ఏఆర్‌ఎస్‌లో సంప్రదించాలి
- వేరుశనగ, కంది, ఆముదం రకాలు సిద్ధం



1694 రకం వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మేలైన విత్తన రకాలు రైతులకు అందుబాటులో పెట్టినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌ఎస్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. అధిక దిగుబడులనిచ్చే టీసీజీఎస్–1694 రకం విత్తన వేరుశనగ, ఐసీహెచ్–66, ఐసీహెచ్–5 రకాలకు చెందిన ఆముదం విత్తనాలు, అలాగే పీఆర్‌జీ–176 రకం విత్తన కంది అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. రేకులకుంట పరిశోధన స్థానాన్ని సంప్రదించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

- ఇక ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు బాగా చివికిన పశువుల ఎరువు ఎకరాకు 4 నుంచి 5 టన్నులు వేసుకుని దుక్కి చేసుకోవాలన్నారు. లేదంటే గొర్రెలు, మేకల మందను పొలాల్లో కట్టించుకుని భూసారం పెంచుకోవాలని తెలిపారు. వేరుశనగలో అధిక దిగుబడులను ఇచ్చే కదిరి–లేపాక్షి, కదిరి–హరితాంధ్ర, టీసీజీఎస్–1694, కే–6, ధరణి తదితర వాటిని ఎంపిక చేసుకోవాలన్నారు. పత్తి సాగు చేసే రైతులు వీలైనంత వరకు 150 నుంచి 160 రోజుల పంటకాలం కలిగిన స్వల్పకాలిక విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతంలో రైతులందరూ వీలైనంత వరకు స్వల్ప వ్యవధిలో విత్తుకుంటే పురుగులు, తెగుళ్లను బాగా అరికట్టవచ్చన్నారు. ఇక ఆముదానికి సంబంధించి హరిత, కిరణ్, జ్వాల, ప్రగతి లాంటి సూటి రకాలు లేదంటే డీసీహెచ్–117, పీసీహెచ్–111, జీసీహెచ్–8, ఐసీహెచ్–66, ఐసీహెచ్–5 లాంటి హైబ్రీడ్ రకాలు అనువుగా ఉంటాయని పేర్కొన్నారు. విత్తన వివరాలు, సలహాల కోసం డాక్టర్ బి.సహదేవరెడ్డి (77990 81289), డాక్టర్ జి.నారాయణస్వామి (62812 84235), డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి (99669 70300) సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.
- ప్రస్తుత పరిస్థితుల్లో దానిమ్మ చెట్లకు విశ్రాంత ఇవ్వాలి. బ్యాక్టీరియా తెగులును అదుపు చేయడానికి ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని 20 రోజుల వ్యవధిలో రెండు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేసుకోవాలి. మార్చి, ఏప్రిల్‌లో నాటిన అరటి మొక్కలకు సిఫారసు చేసిన మోతాదులో ఎరువులు వేసుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితులు ఆవులు, గేదెల్లో గాలికుంటువ్యాధి, ఎంటారోటాక్సీమియా, పారుడురోగం వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున తప్పనిసరిగా టీకాలు వేయించాలి. పశుగ్రాస పంటలుగా నీటివసతి కింద జొన్న, మొక్కజొన్న, సజ్జ, బొబ్బర్ల పంట సాగు చేసుకోవచ్చు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మాస్టర్ సూర్యనారాయణన్



శ్రీకృష్ణలీలలు నాట్య ప్రదర్శనలోని ఓ ఘట్టం

బాలవికాస్ చిన్నారుల కళావైభవం

ప్రశాంతి నిలయం: భారతీయ పురాణ ఇతిహాసాలను ఇతివృత్తంగా చేసుకుని చక్కటి నృత్య భంగిమలతో బాలవికాస్ చిన్నారులు పలు పౌరాణిక ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు భక్తులు శుక్రవారం సత్యసాయి సన్నిధిలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 'నృత్య ఆరాధన' పేరుతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. శివతాండవం, శ్రీ కృష్ణలీలలు వంటి ఘట్టాలను కళ్లకు కట్టారు. సాయంత్రం బాల సంగీత విద్వాంసుడు మాస్టర్ సూర్యనారాయణన్ సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో నిర్వహించిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.



శివతాండవం నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

నీటి బొట్టు.. ఒడిసిపట్టు



కొత్తచెరువు సమీపంలో తవ్వుతున్న ఇంకుడు గుంత



మోరుబాగళ్‌లో తవ్విన ఇంకుడు గుంత

- భూగర్భ జల మట్టం పెరిగేలా చర్యలు
- వర్షపు నీళ్లు ఎక్కడికక్కడే ఇంకేలా గుంతలు
- ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతలకు శ్రీకారం

సాక్షి, పుట్టపర్తి: ప్రకృతి సహకరించినా.. సరైన ప్రణాళిక లేకుంటే అంతా వ్యర్థమే. వర్షాలు తగినంత కురిసినా.. ఒడిసి పట్టకపోతే అంతా వృథానే. అందుకే ప్రభుత్వం వర్షం రూపంలో భూమిని చేరే ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపట్టేందుకు చర్యలు తీసుకుంది. ఇందుకోసం ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టింది. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ఆవరణల్లో ఇంకుడు గుంతలు తవ్వించి.. భూగర్భ జలమట్టం పెరిగేందుకు చర్యలు తీసుకుంటోంది. గతేడాది జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు కూడా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో డ్వామా అధికారులు ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయాల ఆవరణల్లో ఇంకుడు తవ్వించేందుకు తీసుకున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

ఇంకుడు గుంతలతో పాతాళ గంగ మరింతపైకి రానుంది. ఎక్కడి నీరు అక్కడే భూమిలో ఇంకడం కారణంగా భూగర్భ జలాలు పెరుగుతాయి. గత రెండేళ్ల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న క్రమంలో భూగర్భ జలాలు 12 మీటర్ల లోతు నుంచి ఆరు మీటర్ల పైకి వచ్చాయి. ఇంకుడు గుంతల కారణంగా మరింత పైపైకి వచ్చే అవకాశం ఉంది. వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలో ఇంకేవిధంగా చర్యలు తీసుకుంటే బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తాయి. తద్వారా సాగు, తాగునీటికి ఢోకా ఉండదు.

ఎక్కడెక్కడ గుంతలు తీశారంటే..

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలల
- మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల
- ప్రభుత్వాస్పత్రులు, బల్క్ మిల్క్ సెంటర్లు,
- మోడల్ స్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలు
- గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు
- గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ భవనాల వద్ద

ఇంకుడు గుంతల వివరాలు

జిల్లాకు మంజూరు: 222
పనులు ప్రారంభం: 189
గుంతలు పూర్తయినవి: 123
అంచనా వ్యయం : రూ.1.83 కోట్లు

ప్రయోజనాలు ఇలా...

- వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలో ఇంకిపోతుంది. ఫలితంగా నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- భూగర్భ జలాలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. బోర్లు తవ్వితే నీరు పుష్కలంగా వచ్చే అవకాశం ఉంటుంది.
- ఇప్పటికే సాగునీరు అందిస్తోన్న బోర్లలో నీటిమట్టం మరింత పెరుగుతుంది. ఫలితంగా మరింత భూమి సాగులోకి వస్తుంది
- వర్షపు నీరు ప్రవహించకుండా ఎక్కడికక్కడ భూమిలో ఇంకడంతో పారిశుధ్య నిర్వహణ మెరుగవుతుంది.
- నీరు నిల్వకుండా ఇంకిపోతే రోగాలకు దూరంగా ఉండవచ్చు. వర్షపు నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది రోగాలను వ్యాపింపజేసే అవకాశం ఉంటుంది.

విడతల వారీగా పూర్తి చేస్తున్నాం

గడువులోపు లక్ష్యం పూర్తి చేస్తాం. ఇప్పటికే పలు చోట్ల గుంతల తవ్వకం పూర్తయ్యింది. మరికొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇంకొన్ని చోట్ల స్థల పరిశీలన, చిన్న చిన్న సమస్యల వల్ల జాప్యం జరుగుతోంది. జిల్లాకు 222 గుంతలు మంజూరయ్యాయి. ఇందుకు రూ.1.83 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశాం. ఇప్పటికే 189 చోట్ల పనులు చేపట్టి, 123 చోట్ల పూర్తి చేశాం. ఇంకుడు గుంతలతో వర్షపు నీరు ఎక్కడికక్కడ ఇంకుతుంది. ఫలితంగా బోర్లలో సమృద్ధిగా నీళ్లు వచ్చే అవకాశం ఉంది.



– కె.విజయప్రసాద్, పీడీ, డ్వామా

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


మృతురాలు లక్ష్మీదేవి

గుత్తి రూరల్: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన మురళి భార్య లక్ష్మీదేవి (40) కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో పలు ఆస్పత్రుల్లో భర్త చికిత్స చేయించాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న భర్త గమనించి కిందికి దింపి పరిశీలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వాహనం ఢీ కొని జింక మృతి

పెనుకొండ రూరల్: వాహనం ఢీ కొని ఓ జింక మృతి చెందింది. వివరాలు... స్థానిక 44వ జాతీయ రహదారిపై హరిపురం సమీపంలో శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న జింకను వాహనం ఢీకొంది. ఘటనలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం జింక కళేబరాన్ని ఖననం చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రమాదంలో యువకుడి మృతి


సందీప్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో కళ్యాణదుర్గం మండలానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన సందీప్ (30)కు భార్య ప్రియ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా సందీప్ కర్ణాటకలోని గౌరీబిదనూరులో ఉన్న బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి కారులో గౌరీబిదనూరు పట్టణంలోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో చిక్కుకుని సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియగానే మల్లిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'పురం'లో నేడు మెగా జాబ్‌మేళా

హిందూపురం: స్థానిక బాలయేసు డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ నిర్వాహకులు శుక్రవారం వెల్లడించారు. వర్క్ ఎక్స్ సంస్థ సౌజన్యంతో టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా ఉంటుంది. పది, ఇంటర్ ఉత్తీర్ణత, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి, 18 నుంచి 30 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులు. పూర్తి వివరాలకు 95131 33003లో సంప్రదించవచ్చు.

పోలీసుల వలయంలో జిల్లా

- 4న ప్రతి పట్టణంలో రెండేసి డ్రోన్‌లతో భద్రత పర్యవేక్షణ
- ఫలితాన్నిస్తున్న కార్డన్ సెర్చ్‌లు
- 370 వాహనాల సీజ్... 1,300 మంది బైండోవర్


హిందూపురంలో కేవలం రెండు గంటల వ్యవధిలోనే పట్టుబడిన ద్విచక్ర వాహనాలు (ఫైల్)

హిందూపురం అర్బన్: కౌంటింగ్ సమయంలో ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లా అంతటా పోలీసు బలగాలు మొహరించాయి. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పెంచారు. కార్డన్ సెర్చ్‌లు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, పేలుడు పదార్థాల కోసం ముమ్మరంగా వేట కొనసాగిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలతో పాటు, ప్రతి పట్టణంలోనూ సాయుధ బలగాలతో కవాతు చేపట్టి ఎవరైనా అల్లర్లకు పాల్పడితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధమనే సంకేతాలను అందజేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 101 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు గుర్తించారు. ఈ నెల 4న ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా పోలీసు పికెట్లు ఏర్పాటు చేయనున్నారు.

మారణాయుధాలు స్వాధీనం

జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిఘా పెంచారు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా తిరుగుతూ ప్రశాంత జీవనం గడపాలని, ఎవరైనా గొడవలకు దిగితే చర్యలు కఠినంగా ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకూ 173 కార్డన్ సెర్చ్‌లు చేపట్టి ఎలాంటి రికార్డులు లేని 370 ద్విచక్ర వాహనాలు, పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు (టపాసులు) స్వాధీనం చేసుకున్నారు. అలాగే నేరచరితుల ఇళ్లలో సోదాలు చేపట్టి ఐరన్‌రాడ్‌లు, వేట కొడవళ్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో ఉన్న 1,300 మందిని బైండోవర్ చేశారు. ఈ క్రమంలోనే ఫలితాలు వెల్లడయ్యే రోజు అల్లర్లు సృష్టించే అవకాశమున్న 25 మందిని ఇప్పటికే పోలీసులు గుర్తించారు. వీరందరినీ ఈ నెల 4న జిల్లా నుంచి బహిష్కరించనున్నట్లు సమాచారం.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం



శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత నిస్తున్నాం. ఫలితాలు వెల్లడయ్యే రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా సాయుధ బలగాలను మొహరింపజేశాం. కౌంటింగ్ కేంద్రాలకు 2 కిలోమీటర్ల దూరం వరకూ రెడ్‌జోన్ ప్రకటించాం. నాలుగంచెల భద్రతా వ్యవస్థతో పహారా పటిష్టం చేశాం. కౌంటింగ్ రోజున జిల్లాలోని ప్రతి పట్టణాన్ని పోలీసుల ఆధీనంలో తీసుకుంటున్నాం. రెండేసి డ్రోన్ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూం నుంచే నేరుగా భద్రతను పర్యవేక్షించాలా ఏర్పాట్లు చేశాం. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌ను మరింత కాలం కొనసాగిస్తాం.

– మాధవరెడ్డి, ఎస్పీ

అప్రైజర్ ఘరానా మోసం

- బ్యాంక్‌లో నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణం
- మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు

గాండ్లపెంట: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారు అభరణాలు తాకట్టు పెట్టి రుణం తీసుకున్న బ్యాంక్ అప్రైజర్ ఘరానా మోసం వెలుగు చూసింది. విషయంపై బ్యాంక్ మేనేజర్ భరత్‌ప్రవీణ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు... కదిరికి చెందిన రామాచారి గాండ్లపెంటలోని ఏపీజీబీలో అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణం తీసుకునేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కటారుపల్లి గ్రామానికి చెందిన బ్యాంక్ మిత్ర చంద్రశేఖరరెడ్డి వెళ్లాడు. ఆ సమయంలో తనకూ డబ్బు అవసరముందని, తన వద్ద ఉన్న ఆభరణాలను కూడా ఆయన పేరు మీద తాకట్టు పెట్టి రుణం తీసుకుందామని, కంతులు సక్రమంగా చెల్లిస్తానని నమ్మబలికాడు. దీంతో చంద్రశేఖర రెడ్డి సరేననడంతో ఆయన పేరుపై బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.1.16 లక్షల రుణం తీసుకున్నాడు. అనంతరం ఆ నగదును బ్యాంక్ మిత్ర ఖాతా నుంచి తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యాంక్‌లో ఆడిట్ నిర్వహించారు. ఆ సమయంలో చంద్రశేఖరరెడ్డి పేరుపై తాకట్టులో ఉన్న బంగారు ఆభరణాలు నకిలీవిగా గుర్తించి బ్యాంక్ మేనేజర్‌ను అప్రమత్తం చేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టిన బ్యాంక్ మేనేజర్ వాస్తవాలు నిగ్గు తేలడంతో అదే రోజు రామాచారి నుంచి రూ.1.16 లక్షలు రికవరీ చేశారు. అనంతరం ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసిన ఎస్‌ఐ కృష్ణవేణి శుక్రవారం ఉదయం రామాచారిపై కేసు నమోదు చేశారు.

లారీని అటకాయించి దోపిడీ

- డ్రైవర్, క్లీనర్‌ను చితకబాదిన దుండగులు
- పోలీసుల అదుపులో ముగ్గురు


ఘటనను వివరిస్తున్న డ్రైవర్ ఇషాక్, క్లీనర్ సునీల్

గుంతకల్లు: లారీ డ్రైవర్, క్లీనర్‌ను చితకబాది సెల్ ఫోన్లను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని కనపర్తి మండలం చెన్నూర్ గ్రామానికి చెందిన ఇషాక్, సునీల్ లారీ డ్రైవర్, క్లీనర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న ఓ ఫ్యాక్టరీ నుంచి స్లాగ్ (జిప్సం) లోడుతో జమ్మలమడుగు సమీపంలోని దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీకి గురువారం సాయంత్రం బయలుదేరారు. రాత్రి గుంతకల్లు మండలం నక్కనదొడ్డి సమీపంలో ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో (ఏపీ16ఎఫ్‌ఈ 6661) వాహనంలో వస్తున్న వారు ఓవర్‌టేక్ చేసి లారీకి అడ్డు పెట్టారు. దీంతో భయపడిన డ్రైవర్ ఇషాక్ వెంటనే లారీని తప్పించి ముందుకు పోనిచ్చాడు. అయినా దుండగులు లారీని వెంబడిస్తూ సైరన్ మోగించడంతో పోలీసులనుకుని వాహనాన్ని ఐటీసీ డిపో వద్ద రోడ్డు పక్కన ఆపారు. అదే సమయంలో బొలెరో నుంచి కిందకు దిగిన ముగ్గురు యువకులు లారీ డ్రైవర్, క్లీనర్‌ను దుర్భాషలాడుతూ కిందకు లాగి చితకబాదారు. అనంతరం గాలించి వారి వద్ద డబ్బు లేకపోవడంతో రెండు సెల్‌ఫోన్లు లాక్కొని ఉడాయించారు. లారీ డ్రైవర్, క్లీనర్ అరుపులకు అప్రమత్తమైన సమీపంలోని వారు అక్కడకు చేరుకుని విషయం తెలుసుకుని డయల్ 100కు సమాచారం ఇచ్చారు.

పోలీసులు అదుపులో నిందితులు

డయల్ 100 నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. కాగా, నక్కనదొడ్డి వద్ద దారిదోపిడీకి పాల్పడిన దుండగులు గుత్తి సమీపంలోని ఓ ధాబా వద్దకు చేరుకుని భోజనం కోసం వాహనాన్ని ఆపారు. అక్కడ కూడా గొడవకు దిగడంతో ధాబా యజమాని వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడ చేరుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారనలో గుంతకల్లు సమీపంలో దారి దోపిడీకి పాల్పడింది వారేనని నిర్ధారణ కావడంతో గుంతకల్లు రూరల్ సీఐ మహేశ్వరరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేష్ గుత్తికి చేరుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన వారు గుత్తి ఆర్‌ఎస్ సమీపంలోని లచ్చానుపల్లికి చెందిన వారిగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు, వైఎస్సార్ జిల్లా జట్ల విజయం

అనంతపురం: సౌత్‌జోన్ అండర్–19 క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, వైఎస్సార్ జిల్లా జట్లు విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 48.2 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. జట్టులో లోహిత్ లక్ష్మీనారాయణ 40 పరుగులు, చరణ్‌జిత్ 56 పరుగులు, గౌతమ్ కృష్ణ 43 పరుగులు సాధించారు. అనంత జట్టు బౌలర్ వెంకట లోకేష్ నాలుగు వికెట్లు, టి.ప్రదీప్‌రెడ్డి మూడు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 48.5 ఓవర్లలో 205 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులో వెంకట లోకేష్ 40 పరుగులు, బి. ప్రశాంత్ 35 పరుగులు, కోగటం హనీష్‌వీరారెడ్డి 28 పరుగులు, జయంత్‌కృష్ణ 25 పరుగులు, పి.నీలేంద్ర 24 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్ బాలాజీ మూడు, సాయి చరణ్ రెండు, ముఖేష్ రెండు వికెట్లు తీశారు. చిత్తూరు బ్యాటర్ చరణ్‌జిత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

- నెల్లూరు, వైఎస్సార్ జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 40.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. కారుణ్య ప్రసాద్ 47 పరుగులు, పవన్ రుత్విక్ 32, ఎస్ ఎస్ హమీద్ 60 పరుగులు చేశారు. వైఎస్సార్ జిల్లా బౌలర్ ఆర్జిత్ రెడ్డి 3, టి.ధీరజ్ కుమార్ రెడ్డి 3, రణధీర్ రెడ్డి 2, నాగ కుళ్లాయప్ప 2 వికెట్లు తీసి నెల్లూరు జట్టును తక్కువ స్కోర్‌కు కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వైఎస్సార్ జిల్లా జట్టు 40 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో ప్రణీల్ రెడ్డి 118 బంతుల్లో 14 ఫోర్లతో 101 పరుగులు చేశారు. ప్రణీల్ రెడ్డికి తోడు టి. సుదర్శన్ నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 73 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. ఏడు వికెట్ల తేడాతో వైఎస్సార్‌జిల్లా జట్టు విజయం సాధించింది. ప్రణీల్ రెడ్డికి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

ముస్లిం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

హిందూపురం టౌన్: ప్రతి విద్యార్థి ఓ లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలరని వక్తలు అన్నారు. హిందూపురంలోఇన అల్ హిలాల్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ విద్యా చైతన్య సదస్సు–2024 శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన వంద మంది ముస్లిం విద్యార్థులకు షహీద్ టిప్పు సుల్తాన్ ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమానికి అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా బెంగళూరు హుదా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మునీర్ అహమ్మద్, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సమద్ షాహీన్, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ లతీఫ్, డాక్టర్ షర్మిళాబేగం, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, జేఈ వెంకటస్వామి, ఎస్‌డీజీఎస్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ప్రతి ఒక్కరు ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. మత్తుకు బానిస కాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సువర్ణ భారతి కళాశాల అనిల్ కుమార్, ఎన్‌లైట్ కళాశాల ప్రిన్సిపాల్ బాబాఖాన్, సామాజిక సేవకులు హాజీ ఇబ్రహీం, దాయీ తబ్లీక్ జమాత్ అఫాన్, ఇస్మాయిల్, ఉబెదుల్లా హుసేన్, మౌలానా వజీర్ మౌలానా, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బసవనపల్లిలో చోరీ

హిందూపురం అర్బన్: స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిరికెర బసవనపల్లిలో నివాసముంటున్న ఆదినారాయణరెడ్డి ఇంట్లో శుక్రవారం వేకువ జామున చోరీ జరిగింది. ఆదినారాయణరెడ్డి, తన భార్యతో కలిసి బెంగళూరులో నివాసముంటున్న తమ కుమార్తెను చూసేందుకు గురువారం ఉదయం వెళ్లారు. ఇంటికి తాళం వేసిన దుండగులు శుక్రవారం వేకువజామున తలుపులు బద్దలు గొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని 20 తులాల బంగారు నగలు, రెండు కిలోల వెండి సామగ్రి, ఓ సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లారు. తెల్లవారిన తర్వాత ఇంటికి చేరుకున్న ఆదినారాయణరెడ్డి దంపతులు చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో అప్‌గ్రేడ్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

రైలు నుంచి కింద పడి ఏలూరు వాసికి గాయాలు


తీవ్రంగా గాయపడిన షణ్ముక

పెద్దవడుగూరు: ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు... ఏలూరుకు చెందిన షణ్ముక రైలులో ప్రయాణిస్తూ శుక్రవారం మధ్యాహ్నం జూటూరు రైల్వే స్టేషన్‌ను చేరుకున్నాడు. ఈ క్రమంలో ప్లాట్‌ఫాంపై రైలు ఆగుతున్న సమయంలో దిగేందుకు ప్రయత్నించిన ఆయన అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్న క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి షణ్ముకగా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గాయపడిన వ్యక్తి పూర్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని, ఆయన కోలుకున్న తర్వాత మరిన్ని వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.


జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

హిందూపురం: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలుర జట్టును శుక్రవారం ఉదయం హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఎంపిక చేశారు. ఈ ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 35 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన 20 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో తన్మీత్ సాయి (మడకశిర), పరిగికి చెందిన హేమంత్, సురేష్, ధర్మవరానికి చెందిన మణికంఠ, వినీత్, మహమ్మద్ అక్మల్, హర్షవర్ధన్, హిందూపురానికి చెందిన విదంత్, రోహిత్, అర్షాద్, మోహన్‌కుమార్, నవనీత్ స్వరూప్, యోగవర్ధన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, జగన్‌మోహన్, యోగేష్, మడకశిరకు చెందిన కీర్తి చరణ్, ఆదిత్య, కదిరికి చెందిన చంద్రసిద్ధార్థ్, అభిలాష్ ఉన్నారు. ఎంపికలను జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి మహమ్మద్ సలీమ్, ఈసీ సభ్యురాలు విజయవాణి, పీఈటీలు లోక్‌నాథ్, రామాంజినేయులు పర్యవేక్షించారు.

అగ్రి కోర్సులతో కచ్చితమైన ఉపాధి

- తక్కువ ఫీజులకే నాణ్యమైన వ్యవసాయ విద్యా కోర్సులు
- నేటి నుంచి అగ్రి పాలిటెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ


రెడ్డిపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

బుక్కరాయసముద్రం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు కూడా అంత సులువుగా లభ్యం కావడం లేదు. దీంతో ప్రతి ఒక్కరిలోనూ పదో తరగతి పరీక్షలు రాయగానే నెక్ట్స్ ఏమిటనే ప్రశ్న వ్యక్తమవుతూ ఉంటుంది. అయితే పదో తరగతి ఉత్తీర్ణత కాగానే రెండేళ్ల కాల వ్యవధి ఉన్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేయగలిగితే కేవలం 19 ఏళ్ల వయసులోనే కొలువులు దక్కడం ఖాయమని నిపుణులు అంటున్నారు. ఈ క్రమంలోనే అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర తెలిపారు. జిల్లాలోని రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రంతో పాటు శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిరలో ప్రభుత్వ యాజమాన్యంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. అలాగే అనంతపురం, తాడిపత్రితో పాటు శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి.

విద్యార్హతలు ఇలా...

పదో తరగతి ఉత్తీర్ణత అయి 15 నుంచి 22 సంవత్సరాల్లోపు వయసున్న వారికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నారు. www.angrau.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారు. పూర్తి సమాచారానికి ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

సీట్ల కేటాయింపు ఫీజులు ఇలా..

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్సీలకు 15 శాతం సీట్లు, ఎస్టీలకు 6 శాతం, బాలికలకు 33 శాతం, అంగ వైకల్యం కలిగిన వారికి 3 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశ అర్హత పొందిన వారు ఏడాదికి రూ.8,800 చెల్లించాలి. హాస్టల్‌లో వసతి పొందేందుకు రూ.11 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి అయిన తర్వాత డిపాజిట్ సొమ్మును వెనక్కు చెల్లిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ నిర్దేశించిన మేరకు ఏడాదికి రూ.29 వేలు ఫీజు, హాస్టల్‌కు సంబంధించి నెలకు రూ.5,500 చెల్లించాల్సి ఉంటుంది.

బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న అగ్రికల్చర్ కోర్సులు

కోర్సు	కాల వ్యవధి
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ ఆర్గానిక్ ఫార్మింగ్	2 ఏళ్లు
డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్	3 ఏళ్లు
డిప్లొమా ఇన్ హోం సైన్స్	3 ఏళ్లు

చాలా మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు



మా కళాశాలలో చదివిన పిల్లలు చాలా మంది ఇప్పుడు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు మంచి భవిష్యత్తు ఉంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ వసుంధర, ప్రిన్సిపాల్, రెడ్డిపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల